సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 6 । జనవరి । 2025



మార్కెట్ స్థలం ఆక్రమణ

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు స్థలం ఆక్రమణకు గురవుతుంది.

వివరాలు 8లో ▸



ప్రజా ఉద్యమాలు

పాలమూరు అభివృద్ధికి ఉద్యమాలే అంతిమ పరిష్కారమని ప్రొ.హరగోపాల్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /11.2

వాతావరణం

రోజురోజుకు చలి తీవ్రత కాస్త పెరుగుతుంది. మంచు కురుస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కల్వకుర్తి మార్కెట్‌కు భారీగా వేరుశనగ



కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఆదివారం 1,969 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. గరిష్టంగా రూ.6,900, కనిష్టంగా రూ.5,680, సరాసరి ధర రూ.6,670 ధర లభించింది. అలాగే కంది 29 క్వింటాళ్లు రాగా.. గరిష్టంగా రూ.7,060, కనిష్టంగా రూ.6,410, సరాసరి ధర రూ.7,060 ధరలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంతు తెలిపారు.

నేడు మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

నాగర్ కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు కొత్త మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డా. రాజేశ్‌రెడ్డి, డా. వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మార్కెట్‌యార్డులో కార్యక్రమం ఉంటుందని.. రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు యాసంగి వరినాట్లలో నిమగ్నం కావడంతో కేవలం 4 వేల మంది మాత్రమే అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల సంఖ్య కూడా తగ్గించింది. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, వనపర్తి ఒక్కో డిపో నుంచి 4 బస్సుల మాత్రమే నడిపారు. కార్లు, జీపులు, ఆటోలు, ట్రాక్టర్లు, మోటారుసైకిళ్లపైన వచ్చి భక్తులు మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకున్నారు.

దర్శించుకున్న వనపర్తి ఎమ్మెల్యే



మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ బుడుగు శ్రీనివాస్‌యాదవ్, సిబ్బంది ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోరిన కోర్కెలు తీర్చే మైసమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ సలీం, అధికారులు ఉన్నారు.

ఊర్కొండపేట ఆలయ ధర్మకర్తల మండలి ఎన్నిక

ఊర్కొండ: ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలిని ఎన్నుకున్నట్లు ఆదివారం అధికారులు తెలిపారు. ఊర్కొండపేటకు చెందిన తిర్మని బొందయ్యగౌడ్, మొండేళ్ల రమేష్, గుండెమోని మల్లేష్, అమరచింతల వెంకటమ్మ, రాచాలపల్లికి చెందిన సత్యనారాయణరెడ్డి, కాల్యతండాకు చెందిన గోపాల్నాయక్, ఠాకూర్తండాకు చెందిన రమావత్ పత్యానాయక్, గుండ్లగుంటపల్లికి చెందిన నెల్లికొండ రజిత, ఊర్కొండకు చెందిన విజేందర్, ముచ్చర్లపల్లికి చెందిన ధార బంగారయ్య, గుడిగానిపల్లికి చెందిన చిదిరె ఆంజనేయులు, జకినాలపల్లికి చెందిన జి.వెంకటయ్య, ప్రధాన అర్చకులుగా ఊర్కొండకు చెందిన మహేష్ ఎన్నికయ్యారని చెప్పారు. ఈ కమిటీ ఏడాది పాటు కొనసాగనున్నట్లు వివరించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు పకడ్బందీ ఏర్పాట్లు

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: పోలేపల్లి శివారు ఎస్వీకేఎం పాఠశాలలో మంగళవారం నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. ఆదివారం రాత్రి డీఈఓ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఎస్వీకేఎంలో ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి దాదాపు 2,500 మంది ప్రదర్శనకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే 861 ప్రయోగ ప్రదర్శనలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, భోజనాలు, ఇతర సౌకర్యాలు సమకూర్చాలన్నారు. పార్కింగ్, విడిది చేసే స్థలాల నుంచి ప్రదర్శన కేంద్రానికి వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సోమవారమే విద్యార్థులు, ఉపాధ్యాయులు కేంద్రానికి చేరుకుంటారని, వారికి అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయాలన్నారు.

ప్రకృతి ఒడిలో..

పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న నల్లమలలోని టైగర్ సఫారీ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉరుకుల పరుగుల జీవితం.. పట్టణ, నగర ప్రాంతాల్లో కరువైన స్వచ్ఛమైన గాలి.. ఉద్యోగ, వ్యాపారాల్లో తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్న ప్రజలు.. ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో అటవీశాఖ చేపట్టిన టైగర్ స్టే ప్యాకేజీ, టైగర్ సఫారీ పర్యాటక ప్రియులను విశేషంగా ఆకర్షిస్తోంది. సాధారణ రోజుల కన్నా శని, ఆదివారాలు, సెలవు దినాల్లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల నెలరోజుల వ్యవధిలోనే సఫారీ సందర్శకులకు రెండు సార్లు పెద్దపులి కనిపించడం విశేషం. దీంతో టైగర్ స్టే ప్యాకేజీతోపాటు జంగిల్ సఫారీ కోసం మరింత మంది సందర్శకులు ఆసక్తి చూపిస్తున్నారు.

– సాక్షి, నాగర్‌కర్నూల్/ మన్ననూర్


ఆక్టోపస్ వ్యూ పాయింట్

- వారాంతాలు, సెలవు రోజుల్లో క్యూ కడుతున్న సందర్శకులు
- నెల వ్యవధిలో రెండుసార్లు కనిపించిన పెద్దపులి
- వన్యప్రాణులు తరుచుగా తారసపడుతుండటంతో ఆసక్తి
- రెండు రకాల ప్యాకేజీలతో అవకాశం కల్పిస్తున్న అటవీశాఖ


అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో అటవీ అధికారులు టైగర్ సఫారీ ద్వారా పులులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు, అడవి అందాలను వీక్షించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. నల్లమలలో 34 వరకు పెద్ద పులులు, వందకుపైగా చిరుతలు, ఎలుగుబంట్లు, వందల సంఖ్యలో జింకలు, దుప్పులు, మనుబోతులు, అడవి పందులు, అడవి కుక్కలు తదితర వన్యప్రాణులు ఉన్నాయి. టైగర్ సఫారీ వాహనంలో ప్రయాణించే సందర్శకులకు తరుచుగా ఈ వన్యప్రాణులు కనిపిస్తున్నాయి. ఇటీవల డిసెంబర్ నెలలోనే సందర్శకులకు రెండు సార్లు పెద్ద పులులు కన్పించాయి. ఎలుగు బంట్లు, జింకలు, మనుబోతులు ఇక్కడికి వస్తున్న సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. నల్లమలను సందర్శించాలనుకునే పర్యాటకులు అటవీశాఖ టైగర్ స్టే ప్యాకేజీతోపాటు జంగిల్ సఫారీ ట్రిప్‌ను అందిస్తోంది. సఫారీ వాహనంలో ప్రయాణించాలనుకునే సందర్శకులు హైదరాబాద్- శ్రీశైలం రహదారిలో ఉన్న ఫర్హాబాద్ గేటు వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక ఆకర్షణగా వ్యూ పాయింట్లు..

టైగర్ సఫారీలో భాగంగా సందర్శకులను ఫర్హాబాద్ వ్యూపాయింట్ వరకు తీసుకెళ్తారు. ఈ వ్యూపాయింట్ నుంచి రుషుల చెరువు, దట్టమైన అరణ్యం చూడముచ్చటగా ఉంటుంది. ఇక్కడి ఫర్హాబాద్ వ్యూపాయింట్ సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అలాగే హైదరాబాద్- శ్రీశైలం రహదారిలో ఉన్న ఆక్టోపస్ వ్యూపాయింట్ శ్రీశైలం వెళ్లే యాత్రికులను అమితంగా ఆకర్షిస్తోంది.

దట్టమైన అడవిలో..

ఆడవి అందాలను ఆస్వాదిస్తూ 24 గంటల పాటు నల్లమలలో గడపాలనుకునే ప్రకృతి ప్రేమికుల కోసం అటవీశాఖ టైగర్ స్టే ప్యాకేజీ అందిస్తోంది. దట్టమైన అడవిలో సుమారు 20 కి.మీ., టైగర్ సఫారీ వాహనంలో ప్రయాణిస్తూ వన్యప్రాణులు, అడవి అందాలను వీక్షించవచ్చు. మన్ననూర్‌లోని వనమాలికలో సందర్శకులకు ప్రత్యేక కాటేజీల్లో వసతి కల్పిస్తారు. ఆన్‌లైన్‌లో సఫారీ టూర్ బుక్ చేసుకున్న వారికి రూ.4,500 నుంచి రూ.8 వేల వరకు మడ్ హౌస్, చెంచుహట్, ట్రీహౌస్ తదితర ప్రత్యేకమైన కాటేజీలు అందుబాటులో ఉంటాయి. ఈ ప్యాకేజీలో రెండు రోజుల పాటు సఫారీ టూర్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. మన్ననూరులోని సీటీఈటీలో బయోల్యాబ్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రం సందర్శన, అడవి, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పిస్తారు. సాయంత్రం టైగర్ సఫారీ, మరుసటి రోజు ఉదయం అడవిలో పక్షుల సందడిని వీక్షించేందుకు వీలుగా ప్రతాపరుద్రుని కోట వరకు ట్రెక్కింగ్ ఉంటుంది. అనంతరం ఉమామహేశ్వర క్షేత్రం దర్శనంతో సఫారీ టూర్ ముగుస్తుంది. సఫారీ టూర్ కోసం పర్యాటకులు www. amrabadtigerreserve. com వెబ్‌సైట్‌ను సందర్శించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు.


డిసెంబర్ 18న సందర్శకులకు కనిపించిన పెద్ద పులి (ఫైల్)


నల్లమలలో టైగర్ సఫారీ వాహనంలో ప్రయాణిస్తున్న సందర్శకులు (ఫైల్)


సందర్శకులకు కనిపించిన ఎలుగుబంటి (ఫైల్)

జింకలు కనిపించాయి..



టైగర్ సఫారీలో మాకు జింకల గుంపు, అడవి పందులు కనిపించాయి. సుమారు గంటసేపు అడవిలో సంచరించడం కొత్త అనుభూతినిచ్చింది. అడవి అందాలతోపాటు వన్యప్రాణులను దగ్గరగా చూసేందుకు ఈ సఫారీని వినియోగించుకోవచ్చు.

– నిఖిల, హైదరాబాద్

ట్రిప్ బాగుంది..



ఇక్కడి టైగర్ సఫారీ చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాం. ఈ సఫారీ ట్రిప్ మాకెంతో నచ్చింది. మాకు నీల్‌గాయి, జింకలు కనిపించాయి. దట్టమైన అడవి మధ్యలో సఫారీ వాహనంలో ప్రయాణించడం మర్చిపోలేని ఫీలింగ్. ఇకపై వీకెండ్స్‌లో తరుచుగా ఫ్రెండ్స్‌తో కలిసి ఇక్కడికి వస్తాం.

– షుబా, హైదరాబాద్

బెస్ట్ టూరిస్ట్ డెస్టినేషన్..



అడవి అందాలను ఆస్వాదిస్తూ, వన్యప్రాణుల గురించి తెలుసుకోవాలనుకునే ఔత్సాహిక సందర్శకులకు నల్లమల ప్రాంతం బెస్ట్ ప్లేస్. ఇక్కడ ఎకో టూరిజంలో భాగంగా టైగర్ స్టే ప్యాకేజీ, సఫారీ సౌకర్యాలను కల్పిస్తున్నాం. అడవి, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటూనే సందర్శకులకు అవకాశం కల్పిస్తున్నాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ, నాగర్‌కర్నూల్

కాస్త తగ్గారు..!



2024లో 6.5 శాతం తగ్గిన మద్యం విక్రయాలు

- ఉమ్మడి జిల్లాలో గతేడాది రూ.2,717.21 కోట్ల అమ్మకాలు
- ప్రతినెలా సర్కిల్ కార్యాలయాలకు లక్ష్యం కేటాయింపు
- మైనస్‌లో ఉన్నారని నలుగురు సీఐలకు చార్జీ మెమోలు జారీ?
- లక్ష్యం చేరికకు బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి పాలమూరులో 2023 కంటే 2024లో మద్యం విక్రయాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. మందుబాబులు గతేడాది మొత్తంగా రూ.2,717.21 కోట్ల విలువైన మద్యం తాగారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి ప్రత్యేక లక్ష్యం కేటాయించి.. గడువులోగా పూర్తి చేసేలా చేస్తున్నారు. ప్రధానంగా ఎక్సైజ్ శాఖ అధికారులకు ప్రత్యేక లక్ష్యాలు కేటాయించడంతో వారు మద్యం దుకాణదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి నెలనెలా ఇచ్చే టార్గెట్ అనుకున్న సమయానికి పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

ప్రతి నెల 20 శాతం పెంపు

ఉమ్మడి జిల్లాలోని 230 మద్యం దుకాణాల పరిధిలో ప్రతినెలా 20 శాతం మద్యం విక్రయాలు పెంచాలని సర్కిల్ అధికారులకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు లక్ష్యం కేటాయిస్తున్నట్లు అంతర్గత సమాచారం. దీంతో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణదారులకు ప్రతినెలా కొంత లక్ష్యం ఇచ్చి ఆ మేరకు విక్రయాలు పెంచాలని చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి సర్కిల్ పరిధిలో ఉన్న చిన్న దుకాణానికి నెలకు రూ.80 లక్షల వరకు, ఇక పెద్ద దుకాణాలకు రూ.1.30 కోట్ల వరకు లక్ష్యం నిర్దేశిస్తున్నట్లు సమాచారం. అయితే గతేడాది ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయలేదని ఉమ్మడి జిల్లాలో నలుగురు సీఐలకు చార్జీ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో లక్ష్యం మేరకు మద్యం విక్రయాలు చేయడానికి అటు ఎక్సైజ్ అధికారులతోపాటు మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులకు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నారు. ఇక పల్లెల్లో బెల్ట్ దుకాణదారులు ప్రతి బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ఉన్నా..

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్‌లో 90, నాగర్‌కర్నూల్‌లో 67, వనపర్తిలో 37, గద్వాలలో 36 మద్యం దుకాణాల్లో 2023 సంవత్సరం మద్యం విక్రయాలతో పోల్చితే 2024లో 6.5 శాతం మద్యం విక్రయాలు తగ్గాయి. 2023లో ఎమ్మెల్యే ఎన్నికల ఉండటం వల్ల అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు భారీగా పెరిగాయి. ఇక 2024లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నా కూడా కొంతమేర విక్రయాలు తగ్గాయి. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 28 మద్యం దుకాణాల్లో 2023లో 384.03 కోట్ల మద్యం విక్రయాలు జరిగితే.. 2024లో రూ.381.81 కోట్ల విక్రయాలు జరిగాయి. జడ్చర్ల సర్కిల్ పరిధిలో 26 మద్యం దుకాణాలు ఉండగా 2023లో రూ.324.24 కోట్ల అమ్మకాలు జరగగా.. 2024లో రూ.327.09 కోట్ల మద్యం విక్రయించారు. ఇక్కడ మాత్రం 2023తో పోల్చితే 2024లో రూ.3 కోట్ల వరకు విక్రయాలు పెరిగాయి.

టాప్‌లో పాలమూరు

గతేడాది ఉమ్మడి జిల్లాలో జరిగిన మద్యం అమ్మకాల్లో మహబూబ్‌నగర్ జిల్లా మొదటి స్థానంలో నిలవగా.. చివరగా వనపర్తి జిల్లా ఉండటం విశేషం. పాలమూరులో కూడా అధిక విక్రయాలు జడ్చర్లలో ఉన్నాయి. ఆ తర్వాత రెండో స్థానంలో నాగర్‌కర్నూల్, మూడో స్థానంలో గద్వాల జిల్లాలు ఉన్నాయి.

టార్గెట్ ఇవ్వలేదు..

ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ అధికారులు ఎవరికీ మద్యం అమ్మకాలు పెంచాలని టార్గెట్ ఇవ్వడం లేదు. అలాగే మద్యం దుకాణాలకు కూడా విక్రయాలు పెంచాలని చెప్పలేదు. 2023 ఏడాదితో పోలిస్తే 2024లో కొంతమేర విక్రయాలు తగ్గాయి. ఇక 2023 డిసెంబర్‌తో పోల్చుకుంటే 2024 డిసెంబర్‌లో 18 శాతం విక్రయాలు తక్కువ ఉన్నాయి. అమ్మకాలు తగ్గాయని ఏ ఒక్క అధికారిపై చర్యలు కూడా తీసుకోలేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, డీసీ, ఎక్సైజ్ శాఖ

జిల్లాల వారీగా గతేడాది జరిగిన మద్యం విక్రయాలు

జిల్లా	ఐఎంఎల్	బీరు	ఆదాయం (రూ.కోట్లలో..)
మహబూబ్‌నగర్, పేట	11,47,177	17,23,820	1,106.83
నాగర్‌కర్నూల్	6,50,693	10,79,673	675.07
గద్వాల	5,68,011	5,31,032	506.23
వనపర్తి	4,39,996	6,06,772	429.64

పేదల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

అచ్చంపేట: రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం రైతులు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26 నుంచి సాగు చేస్తున్న రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతిపక్ష పార్టీల ఊహాగానాలు, అంచనాలకు అందని విధంగా సాగు భూమికి రైతుభరోసాతో పాటు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, రేషన్ కార్డులు ఇచ్చే నిర్ణయం తీసుకోవడంతో అన్నివర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందని, ఇళ్లు లేని పేదలకు నిర్మించే బృహత్తర పథకం కొనసాగుతుందని తెలిపారు. కులగణన ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ అవకాశాలు కల్పించే ప్రక్రియ మొదలైందన్నారు. కొత్త మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల ఏర్పాటు, ఉగాది నాటికి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం సన్నాలకు రూ.500 బోనస్, అర్హులైన ప్రతి ఒక్కరికి పంట రుణమాఫీ చేశామన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలో మాఫీ వర్తింపజేస్తుందని వివరించారు. సీఎం త్వరలో నియోజకవర్గాల పర్యటన చేయనున్నారని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత, నర్సింహారావు, గోపాల్‌రెడ్డి, కట్టా అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, జగత్‌రెడ్డి పాల్గొన్నారు.

‘రైతుభరోసా రూ.15 వేలు ఇవ్వాలి’


అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వానాకాలం సీజన్ ముగిసినా ఇప్పటి వరకు రైతుభరోసా ఇవ్వలేదని, ప్రస్తుత యాసంగిలోనూ ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ వేదిక మీద రాహుల్‌గాంధీ సమక్షంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు శ్రీనివాసులు, దేశ్యానాయక్, ఆంజనేయులు, శ్రీనివాసులు, ఈశ్వర్, పొదిల రామయ్య, అశోక్, మల్లేశం, శంకర్‌నాయక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం!

జిల్లాలో కొనసాగుతున్న రహదారి భద్రతా మాసోత్సవాలు

- పోలీసు, రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా..


పెద్దకొత్తపల్లి మండలంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటన (ఫైల్)


నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో ఎదుట ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: మితిమీరిన వేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారినపడి కుటుంబసభ్యులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారు పలువురు వాహనదారులు. రహదారి నిబంధనలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా వాహన చోదకులు కొద్దిరోజులు మాత్రమే పాటిస్తూ మళ్లీ యథావిధిగా మారుతున్నారు. ఏ విషయంలోనైనా చట్టాలు కఠినంగా అమలు చేస్తే వచ్చే ఫలితాల కన్నా.. ప్రజల్లో స్వచ్ఛందంగా మార్పు వస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు ఏటా దేశవ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రవాణా, పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 31 వరకు మాసోత్సవాలు నిర్వహించి రహదారి నిబంధనలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జాగ్రత్తలతోనే నియంత్రణ..

వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. ముఖ్యంగా తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రాణనష్టం జరిగే ఆస్కారం ఎక్కువ. 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతే వాహనాలు నడపాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు. భారీ వాహన డ్రైవర్లు ఎక్కువ గంటలు వాహనాలను నడపడంతో అలసిపోయి నిద్రలోకి జారుకోవడంతో అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రమాదాలు జరుగుతాయి. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు.

స్వచ్ఛందంగా మార్పురావాలి..



రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాహనదారుల్లో స్వచ్ఛందంగా మార్పు వస్తేనే ప్రమాదాలను అరికట్టవచ్చు. అతివేగంతో వాహనాలు నడిపి మృతిచెందితే కుటుంబ సభ్యులకు కలిగే వేదనను ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– చిన్న బాలు, జిల్లా రవాణాశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

జిల్లాలో ఇలా..

జిల్లా పరిధిలో గడిచిన మూడేళ్లలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు మృత్యువాత పడగా.. మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. మరణించిన వారిలో హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంతోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. 2024లో 385 రోడ్డు ప్రమాదాలు జరిగితే 184 మంది మృతిచెందగా 420 మంది తీవ్రంగా గాయపడ్డారు. 2023లో 367 రోడ్డు ప్రమాదాలు జరగగా 191 మంది మృతిచెందగా 394 మంది తీవ్రంగా గాయపడ్డారు.

అవగాహన కార్యక్రమాలు..

జిల్లాలో ఈ నెల 31 వరకు పోలీసు, రవాణాశాఖ సంయుక్తంగా రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయి. ఆటో, లారీ డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

ధరూరు : పొలాల వద్ద బోరు మోటార్లను పైకి తీసే ఓ మెకానిక్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మన్నాపురం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకోగా అతడి భార్య ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ షకూర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని దోర్నాలకి చెందిన పోలన్న(30) బోర్ల మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం మన్నాపురం గ్రామ శివారులో గోవింద్ అనే రైతు పొలం వద్ద బోరుబావిలో మోటారు తీయడానికి వెళ్లాడు. ఆక్రమంలో బోరు వద్ద పైనున్న కరెంట్ తీగలను గమనించలేదు. మోటార్ బయటకు తీసే యంత్రం తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలన్న భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫాంపండ్‌లో పడి రైతు..


బంగారయ్య (ఫైల్)

బిజినేపల్లి : పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు ఫాంపండ్ గుంతలోని మోటార్‌కు మరమ్మతు చేస్తూ ప్రమాదశావత్తు అందులో జారిపడి మృతి చెందాడు. ఈఘటన ఆదివారం ఉదయం వెలుగుచూసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మండలం లోని నందివ డ్డెమాన్‌కి చెందిన బంగారయ్య(42) అనే వ్యక్తి శనివారం రాత్రి పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఫాంపండ్‌లోని మోటారు పనిచేయ లేదు. దీంతో ఆగుంతలోకి దిగి నాచును తొలగించే ప్రయ త్నం చేశాడు. ప్రమాదశావత్తు అతడు అందులో పడి మరణించాడు. పొలానికెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూశారు. బంగారయ్య నీటి గుంతలో పడి చనిపోయినట్లు గుర్తించారు. అతడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బంగారయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. వివరాలు.. బల్మూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన శీలం వెంకటయ్య(48) తన బైక్‌పై తెలకపల్లి నుంచి కొండారెడ్డిపల్లికి వెళ్తున్నాడు. తెలకపల్లి సమీపంలోని లింగాల రోడ్డులో రైస్ మిల్లు వద్ద వైకుంఠ రథాన్ని ఢీకొట్టగా వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాగర్‌కర్నూలు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలు దాటుతున్న ఓమహిళను రైలు ఢీకొట్టడంతో మృతిచెందినట్లు రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. వివరాలు.. దివిటిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం 3.30గంటలకు గుర్తుతెలియని మహిళ(45) రైలు పట్టాలు దాటుతుండగా జడ్చర్ల వైపు నుంచి వచ్చిన రైలు బలంగా ఢీకొట్టింది. తలకు, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో చికిత్సకోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాసేపటికే ఆమె మరణించింది. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, సదరు కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..

- గుండెపోటుతో వ్యక్తి మృతి

బిజినేపల్లి : అంత్యక్రియల్లో పాల్గొని ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతిచెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలోని బద్యా తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బద్యాతండాకు చెందిన తారు నాయక్(80) అనే వృద్ధుడు మృతిచెందాడు. అతడికి కుమారుడి వరుస అయిన సోమ్లానాయక్(45) ఆదివారం అంత్యక్రియలకు వచ్చాడు. ఈ కార్యక్రమం ముగిశాక ఇంటికి వచ్చిన కాసేపటికే సోమ్లానాయక్ గుండెపోటుతో కింద పడిపోయాడు. బంధువులు అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య చిట్టి, ఒక కుమారుడు ఉన్నారు.

మద్యం మత్తులో కండక్టర్‌పై దాడి

మల్దకల్ : మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి విధుల్లో ఉన్న ఓ కండక్టర్‌పై అకారణంగా దాడి చేశాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని తాటికుంట సమీపంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. అయిజ నుంచి గద్వాలకు వస్తున్న ఆర్టీసీ బస్సులో రాత్రి 9గంటల సమయంలో అయిజకు చెందిన రాజు అనే ప్రయాణికుడు మద్యం మత్తులో బస్సు వెనక సీట్లో నిద్రించాడు. రాజును కండక్టర్ రామనాథం టికెట్ తీసుకోవాలని కోరాడు. దీంతో అతడు టికెట్ తీసుకోకుండా కండక్టర్‌తో దుర్భషలాడి దాడిచేశాడు. ఈఘటనపై కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్కెట్ స్థలం ఆక్రమణ


పాత నిర్మాణానికి మించి ముందుకు చేపట్టిన నిర్మాణాల్లో ఒకటి

- కుదించుకుపోతున్న రోడ్లు
- ఇబ్బందికరంగా రాకపోకలు
- చోద్యం చూస్తున్న అధికారులు

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌యార్డు స్థలం రోజురోజుకు ఆక్రమణల బారినపడుతోంది. విశాలమైన యార్డు స్థలం నాలుగు వైపుల ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారు. వాస్తవంగా వారికి రిజిస్ట్రేషన్ దస్తావేజుల్లో ఉన్న స్థలం కంటే ఎక్కువగా ముందు వైపు ఆక్రమించుకుంటున్నారు. దీంతో విశాలమైన రోడ్లు కుదించుకుపోయాయి. దాదాపు 80అడుగుల రోడ్లు ఆక్రమణల కారణంగా 20అడుగులకు మాత్రమే పరిమితమయ్యాయంటే పరిస్థితిని ఊహించొచ్చు. యార్డుకు రాకపోకలు సాగించే రైతులతో పాటు ఆప్రాంతానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌కు పదేపదే అంతరాయం కలగడమే గాక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఇదీ పరిస్థితి..

బాదేపల్లి మార్కెట్‌యార్డును 11 ఆగస్టు 1936న ప్రభుత్వం ఏర్పాటుచేసింది. యార్డును దాదాపు 14ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేశారు. యార్డుకు కేటాయించిన స్థలంలో మధ్యలో యార్డు కార్యాలయంతో పాటు సమీపంలో రైతుల ఎద్దుల బండ్లు, పశువులకు నీటితొట్లు వంటి సౌకర్యాలను కూడా ఏర్పాటుచేశారు. ఇక యార్డు కార్యాలయానికి నలుదిక్కులా రోడ్లు కలిసేలా కమీషన్ ఏజెంట్ల దుకాణాలకు సంబంధించి గృహసముదాయాన్ని నిర్మించారు. సుమారు 100 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో ఈసముదాయాన్ని నిర్మించారు. దాదాపుగా 50 దుకాణాలకు సంబంధించి యార్డు చుట్టూ నిర్మించారు.ఈ దుకాణాల ఎదుటే చాలా ఏళ్లపాటు రైతులు తాము పండించిన పంట దిగుబడులను కుప్పలుగా పోసి విక్రయించేవారు. అయితే యార్డు కార్యాలయం నాలుగువైపులా ప్రహరీ నిర్మించడంతో పాటు షెడ్లు నిర్మించడంతో రైతులు తమ పంట దిగుబడులను విక్రయించేందుకు యార్డు ఆవరణలోకి తరలించారు. నాటి నుంచి యార్డు ఆవరణలోని షెడ్లలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి.

ప్రమాదభరితంగా యార్డు రోడ్లు

యార్డులోని రోడ్లు ప్రమాదభరితంగా మారాయి. కేవలం 20అడుగల వరకు కుదించుకుపోవడంతో ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. యార్డు లోపలికి రైతులు తమ పంట దిగుబడులను ట్రాక్టర్లు, లారీల్లో తీసుకురావడానికి, ఇక్కడ కొనుగోలు చేసిన దిగుబడులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వాహనాల రాకపోకలు ప్రమాదభరితంగా మారాయి. వీటికి తోడు రైల్వే రేక్‌పాయింట్ నుండి ఎరువులు తరలించడానికి ఇవే రోడ్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రోడ్లను విశాలం చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం..



మార్కెట్ యార్డులో ఎక్కడికక్కడ స్థలాలను ఆక్రమిస్తున్నారు. గతంలో నిర్మించిన కట్టడాల వరకే అనుమతులుండగా అందుకు విరుద్ధంగా దుకాణాల ఎదుట ఉన్న ఖాళీ స్థలాలను అక్రమించారు. ఆక్రమణలపై రాష్ట్రస్థాయిలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– అనిల్‌కుమార్, సామాజికవేత్త, జడ్చర్ల

పరిశీలించి చర్యలు చేపడుతాం..



మార్కెట్‌యార్డులో ఆక్రమణలకు సంబంధించి ఫిర్యాదులున్నాయి. రికార్డులను పరిశీలించి ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపడుతాం. మొదటగా ఆక్రమణలను గుర్తించి వాటికి సంబంధించి నిర్మాణ అనుమతులు ఎంతమేరకు ఉన్నాయో పరిశీలిస్తాం.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

స్థలాలను ఆక్రమించి భవనాలు, షెడ్లు

యార్డు అంతర్భాగంలో క్రయవిక్రయాలు కొనసాగుతుండడం, రైతులకు తక్‌పట్టీలు, తదితర నిర్వహణను యార్డు ఆవరణలోని బయట గల దుకాణాల్లో ఏజెంట్లు చేస్తున్నారు. ఈక్రమంలో దుకాణాల ఎదుట దాదాపు 80 నుంచి 100 అడుగుల మేరకు రోడ్డు, ఖాళీస్థలం మిగిలిపోయింది. వ్యాపారులు తమ దుకాణాల ఎదుట దాదాపు 50 నుంచి 60అడుగుల మేరకు ఖాళీ స్థలాలను ఆక్రమించి భవనాలు, షెడ్ల నిర్మాణం చేపట్టారు. ఈకారణంగా రోడ్డు 20 అడుగులకే పరిమితమైంది. ఒకప్పుడు గంజ్ అంటేనే రైతులకు సంబంధించిన క్రయవిక్రయాలు సాగే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం ఆ దుకాణ సముదాయాలు వివిధ వ్యాపార, వాణిజ్య కేంద్రాలుగా మారిపోయాయి.


దర్జాగా రోడ్డుపైకి నిర్మించిన మెట్ల ర్యాంపు

‘పదేళ్లలో ఉన్నత విద్యావ్యవస్థ వెనకబాటు’


మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్రంలో గత పదేళ్లలో ఉన్నత విద్యావ్యవస్థలో రిక్రూట్‌మెంట్ లేకపోవడంతోపాటు నిధులు కేటాయించకపోవడంతో వెనకబాటుకు గురైందని ఉన్నత విద్యామండలి చైర్మన్, జేఎన్టీయూ వైస్ చాన్సలర్ జిట్టా బాలకిష్టారెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థలో మార్పు కోసమే సీఎం రేవంత్‌రెడ్డి విద్యా శాఖను తన వద్ద ఉంచుకున్నారని చెప్పారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా ఉన్నత విద్యా వ్యవస్థలో ఉన్న సిలబస్‌ను ప్రస్తుత కాలానుగుణంగా ఉద్యోగాలు వచ్చేలా మార్పులు చేయనున్నట్లు వివరించారు. సోషల్ సైన్స్, ఇంజినీరింగ్ సిలబస్‌లలో ఉద్యోగాలకు అనుగుణంగా సబ్జెక్టు లేదని, ఇంజినీరింగ్‌లో ఉద్యోగాలకు అనుగుణంగా ఉండేలా పరిశ్రమలకు సంబంధించిన సబ్జెక్టును మార్పు చేయనున్నామని, ఇందుకోసం కొన్ని కమిటీలు ఏర్పాటు చేశామని, వాటి నివేదిక వచ్చిన తర్వాత ముందుకెళ్తామన్నారు. ఈ నెల 7న వందమంది పారిశ్రామికవేత్తలు, 50 మంది విద్యావేత్తలతో నోవాటెల్ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి విద్యావ్యవస్థలో మార్పులపై చర్చిస్తామన్నారు. ఈ నెల 8న వెయ్యిమంది కళాశాల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఓడీలతో జేఎన్టీయూలో ఇంజినీరింగ్ సిలబస్‌పై చర్చిస్తామని తెలిపారు. ఉన్నత విద్య సిలబస్‌లో మార్పు చేయడమే కాకుండా నిపుణులతో సబ్జెక్టు మెటీరియల్ తయారు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. జిల్లాలో పీజీ సెంటర్, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరడంతో ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం


బీసీల ఐక్యతను చాటుతున్న బీసీ సంఘాల నాయకులు

- ఆత్మగౌరవం కోసమే రాజ్యాధికార పోరాటం
- రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమే
- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్రఅధ్యక్షుడు దాసు సురేష్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీల రాజ్యాధికార ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సరేష్ అన్నారు. ఆదివారం మహబూబ్‌గర్‌లోని పద్మశాలి భవన్‌లో ఉమ్మడి జిల్లా బీసీ ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసమే బీసీలు రాజ్యాధికార పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనన్నారు. అగ్రకులాలు బీసీల వ్యాపార, రాజకీయ అవకాశాలను హరిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాధికారం కోసం బీసీలు చేస్తున్నది ధర్మ పోరాటమని పేర్కొన్నారు. అన్ని మండలాల్లో, నియోజవర్గాల్లో త్వరలోనే పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటుచేసి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేపడుతామన్నారు. ఇకపై అగ్రవర్ణాల వాటా అగ్రవర్ణాలు, అట్టడుగు వర్గాల వాటా అట్టడుగు వర్గాలు అనుభవించేలా సామాజిక న్యాయాన్ని సాధిస్తామన్నారు. అనంతరం రాజ్యాధికార సమితి క్యాలెండరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ అధ్యక్షుడు నారగోని, నాయకులు అక్కల రమ, సాయిబాబ, బుదారపు సత్తెమ్మ, బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాస్‌రాం నాయక్, జాతీయ ఓబీసీ మోర్చ సంతోష యాదవ్, శాంతి నాయక్, పీసీసీ ముఖ్య కార్యదర్శి సంజీవ్ కుమార్ ముదిరాజ్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్, కిషోర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మైత్రియాదయ్య ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ నియామక పత్రాన్ని అందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి భజన పోటీలు


బహుమతులు అందజేస్తున్న గరికపాటి నర్సింహారావు తదితరులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పట్టణం శ్రీపాండురంగస్వామి భజన మండలి స్వర్ణోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి భజన పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 42 టీంలు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నిలిచిన వనపర్తి జిల్లా మాందాపురం ప్రాంతానికి చెందిన వీరభద్ర భజన మండలికి రూ.25 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన యాదగిరిగుట్ట మండలం వీరప్రతాప మారుతి భజన మండలికి రూ.15వేలు, తృతీయస్థానంలో నిలిచిన వనస్థలిపురం శ్రీవెంకటేశ్వర భజన మండలికి రూ.11వేల నగదు బహుమతితో పాటు మెమోంటోలను ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం స్వర్ణోత్సవాల ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తడక వెంకటేశం, భజన మండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, మార్కండేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, భారత లవకుమార్, కర్నాటి ధనుంజయ్య, భజన మండలి ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్, సహాయ కార్యదర్శి దోర్నాల శ్రీనాథ్, కోశాధికారి కొంగరి పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,021అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ 1,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,050 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 10 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

సిద్ధార్థ్ రిమాండ్‌కు తరలింపు

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అమ్మాయిల టాయిలెట్స్‌లో సెల్‌ఫోన్ ఏర్పాటుచేసి వీడియో రికార్డింగ్ చేసిన వ్యవహారంలో నిందితుడు సిద్ధార్థ్‌ను వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పలుసెక్షన్లతో కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో శనివారం అర్ధరాత్రి 12.45 ప్రాంతంలో జిల్లా జైలుకు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య తెలిపారు. వీడియోలు తీసిన సెల్‌ఫోన్‌ను ఐటీ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఏటా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆపార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ రైతుభరోసా రూ.12 వేలు చెల్లిస్తామని నిర్ణయించడం అన్యాయమని అన్నారు. రైతన్న ఆత్మహత్యలు అరికట్టడానికి గత ప్రభుత్వం రైతు భరోసాను ప్రకటించిందని గుర్తుకు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతు ఓట్లు ఆకర్షించడానికి కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతు భరోసాకు ఏటా ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని ఆరోపించారు. తీరా అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా వానాకాలం సీజన్ రైతు భరోసాకు ఎకరాకు రూ 7,500 ఇవ్వలేదని, ఇస్తారో లేదో స్పష్టత లేదన్నారు. రాష్ట్ర క్యాబినెట్ పునరాలోచించి రైతు భరోసా కింద ఏటా ఎకరాకు రూ. 15,000 అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు,, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, గోపాల్, పద్మ, జిల్లా కమిటీ సభ్యులు, దీప్లా నాయక్, చంద్రకాంత్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు .

ఆడపిల్లలను కన్నెత్తి చూడాలంటే భయపడేవారు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


పాలిటెక్నిక్ విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడపిల్లలను కన్నెత్తి చూసేందుకు భయపడేవారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలో సెల్ ఫోన్ కలకలం నేపథ్యంలో ఆదివారం ఆయన కాలేజీని సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై వేధింపులు పెరిగిపోయాయని ఆరోపించారు. పాలిటెక్నిక్ కాలేజీలో ఆకతాయి బాత్‌రూంలో ఫోన్ రికార్డు చేయడం భద్రత వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఘటనలు కాలేజీల్లో, స్కూళ్లలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బ్యాంక్‌లో చోరీ నిందితులు?

అమరచింత: సంచలనం రేపిన అమరచింత యూనియన్ బ్యాంక్ చోరీకి విఫలయత్నం వ్యవహారానికి సంబంధించిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జిల్లాలోని ఓగ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు బ్యాంక్‌లో చోరీకి యత్నించినట్లు సమాచారం. గతేడాది డిసెంబర్ 30వ తేదీన అమరచింత యూనియన్ బ్యాంక్‌లో చోరీ జరిగినట్లు బ్యాంకు మేనేజర్ పోలీసులకు సమాచారమివ్వగా వారు దర్యాప్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. పోలీసులు ఎట్టకేలకు చోరీకి యత్నించినవారిని అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించినట్లు తెలిసింది. ఈచోరీలో ఒక అమ్మాయి సైతం ఉండటం విశేషం. ఈవ్యవహారంపై సీఐ శివకుమార్‌ను అడుగగా సోమవారం ఎస్పీ ముందు నిందితులను హాజరుపరిచి వివరాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

మల్దకల్ : అప్పుల బాధతో ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మల్దకల్‌కి చెందిన కుమ్మరి నర్సింహులు(42) తన ఇంటి కోసం గద్వాలలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రుణం తీసుకున్నాడు. లోన్ చెల్లించాలని అతడిని ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మనస్థాపం చెందిన నర్సింహులు శుక్రవారం తన ఇంటి సమీపాన ఉన్న ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. నర్సింహులుకు భార్యతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పట్టణంలో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల వేధింపులు రోజురోజుకు ఎక్కువగా అవుతున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన చెన్నయ్య(45) అనే వ్యక్తి ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నందివడ్డెమాన్‌కి చెందిన చెన్నయ్య హైదరాబాద్‌లో మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం మంజూరుచేసే ఉచిత గృహాల నమోదు కోసం కొద్దిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉండటం కుటుంబ సభ్యులు గుర్తించారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. చెన్నయ్యకు ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.


కాంక్రీట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకులు దుర్మరణం


గణేష్ (ఫైల్)


రాంకోటి (ఫైల్)

చారకొండ: వేగంగా వచ్చిన ఓకారు వెనుక నుంచి సిమెంట్ కాంక్రీట్ ట్యాంకర్‌ను ఢీకొట్టగా ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మండలంలోని జూపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఈఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. దేవరకొండ వైపు నుంచి కల్వకుర్తి వైపునకు ఓ సిమెంట్ ట్యాంకర్ వెళ్తుంది. అదే సమయంలో దేవరకొండ వైపు నుంచి ఓకారు వేగంగా వచ్చి జూపల్లి సమీపంలో ట్యాంకర్‌ను ఢీకొట్టి దానికి కిందకు దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వెల్దండ మండలం కోట్రకి చెందిన గణేష్(32), కల్వకుర్తి మండల తాండ్రకి చెందిన కేతమల్ల రాంకొటి(34) మృతిచెందారు. కారు నుజ్జునుజ్జు అయింది. కారు ట్యాంకర్ కిందకు దూసుకెళ్లడంతో బొలెరో వాహనానికి చైన్ కట్టి కారును లాగి పోలీసులు మృతదేహాలను బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంషోద్దిన్ తెలిపారు. పోలీసులకు గ్రామస్తులు సహకరించారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రించి మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు గణేష్‌కు భార్య శివలీల, పిల్లలు ఉన్నారు. రాంకొటికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు.


ట్యాంకర్ కిందకు దూసుకెళ్ళిన కారు

యువకుడి మృతదేహం వెలికితీత


బాలస్వామి (ఫైల్)

ధన్వాడ: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం ముందు ఉన్న బావిలో శనివారం రాత్రి ఈతకెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఫైర్ సిబ్బంది వెలికితీసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. వివరాలు.. శనివారం సాయంత్రం 7గంటల సమయంలో బాలస్వామి(25) అనే యువకుడు ఈతకెళ్లి మునిగిపోయాడు. మృతదేహాన్ని వెలికితీసేందుకు అగ్నిమాపక సిబ్బంది స్థానికులతో కలిసి నాలుగు మోటార్లను పెట్టి బావిలో నీటిని తోడేశారు. దాదాపు 90శాతం నీటిని తోడేశాక స్థానిక ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది నీటిలోకి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యలకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హైడ్రా మళ్లీ వీకెండ్ ఆపరేషన్

▶ మొదటి పేజీ తరువాయి

ఏవీ రంగనాథ్ శనివారం అక్కడ పర్యటించి పూర్వాపరాలు తెలుసుకున్నారు. హైడ్రా ఏర్పాటైన తొలినాళ్లలో దాదాపు ప్రతి వీకెండ్‌లోనూ ఓ అక్రమ నిర్మాణం కూల్చివేత ఉండేది.

అక్రమ నిర్మాణాలెన్నో..

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో అనేక అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. 100 ఫీట్ల రోడ్డులో ఉన్న 684 చదరపు గజాల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఐదు అంతస్తుల్లో ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది అక్రమ నిర్మాణమని గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు.. గత ఏడాది ఫిబ్రవరి 14న షోకాజ్ నోటీసులు, 26న స్పీకింగ్ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిని భవన యజమాని హైకోర్టులో సవాల్ చేశారు. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం అది అక్రమ నిర్మాణమని తేల్చి, కూల్చివేయాలని గత ఏడాది ఏప్రిల్ 19న ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ అధికారులు.. గత ఏడాది జూన్ 13న ఆ భవనం స్లాబ్‌కు అనేక చోట్ల పెద్ద పెద్ద రంధ్రాలు చేసి విడిచిపెట్టారు. వాటిని పూడ్చేసిన యజమాని నిర్మాణం కొనసాగిస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం దీనిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఇటీవల సదరు అక్రమ నిర్మాణంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

రాత్రి 8 గంటల వరకు..

క్షేత్రస్థాయిలో పర్యటించిన ఏవీ రంగనాథ్, భవనాన్ని కూల్చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం ఆ భవనం వద్దకు చేరుకున్న 'బాహుబలి క్రేన్' కూల్చివేత మొదలు పెట్టింది. రాత్రి 8 గంటల వరకు కూల్చివేత కొనసాగింది. అక్కడ పోలీసులు, హైడ్రా అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భవనం ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో విద్యుత్ సరఫరా ఆపేయడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలన్నింటినీ కూల్చివేస్తామని హైడ్రా అధికారులు తెలిపారు.

అనుమతిచ్చిన అధికారుల వివరాలపై ఆరా తీస్తున్నాం..

హైకోర్టు అక్రమం అని తేల్చినా భవన నిర్మాణం కొనసాగడానికి కారణమైన అధికారుల వివరాలు ఆరా తీస్తున్నాం. బాధ్యులపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం. అయ్యప్ప సొసైటీలో దాదాపు అన్నీ అక్రమ నిర్మాణాలే. ఆ భవనాలకు ఫైర్ ఎన్‌ఓసీ, భవన నిర్మాణ అనుమతి కూడా లేదు. అయ్యప్ప సొసైటీలో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీతో కలిసి సమీక్షిస్తాం. హైకోర్టు నుంచి స్పష్టమైన కూల్చివేత ఉత్తర్వులు ఉన్న వాటిని తొలి దశలో కూల్చేస్తాం. –ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

అడుగడుగునా కమీషన్లు..

స్కామ్‌ల పరం.. అమరావతి పురం!

ఏపీ సర్కారు రియల్ ఎస్టేట్ వెంచర్ 'హ్యాపీ నెస్ట్' టెండర్లలో అక్రమాలు

- రాజధాని అమరావతిలో గెజిటెడ్ ఆఫీసర్ల కోసం జీ+12 అంతస్తులతో 14 టవర్లలో 1,440 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.492.04 కోట్లతో సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.1,806.29 మాత్రమే. ఇక హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టులో జీ+18 అంతస్తులతో 12 టవర్లలో 1,200 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ మాత్రం నిర్మాణ వ్యయం ఏకంగా రూ.4,511.76 చొప్పున నిర్దేశించారు. నిజానికి అంతస్తులు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం తగ్గాల్సింది పోయి ఇక్కడ అమాంతం పెరిగిపోయింది. హ్యాపీ నెస్ట్.. గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్లు.. ఇవి రెండూ షీర్ వాల్ టెక్నాలజీతోనే నిర్మాణాలు చేపడతారు. వాటి డిజైన్లు, నిర్మాణ రీతి, సౌకర్యాలు ఒకటే. కానీ నిర్మాణ వ్యయం మాత్రం వేర్వేరు.
- అధునాతన సదుపాయాలు, నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగించి కట్టే బహుళ అంతస్తుల భవనాల్లోనూ (టవర్స్) నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.1,800 నుంచి రూ.2 వేలకు మించదని (జీఎస్టీ, సీనరేజీ లాంటి అన్ని పన్నులతో కలిపి) విజయవాడ-గుంటూరు, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు తదితర ప్రాంతాల్లో అత్యంత ప్రతిష్టాత్మక రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన పేరు మోసిన బిల్డర్లు చెబుతున్నారు. కానీ.. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారి రాజధాని అమరావతిలో చేపట్టిన హ్యాపి నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టులో మాత్రం చదరపు అడుగు నిర్మాణ వ్యయం ఏకంగా రూ.4,511.76 ఉంది. దీన్ని బట్టి ఒక్కో చ.అడుగుకు రూ.2,500కిపైగా అంచనా వ్యయాన్ని పెంచేసినట్లు స్పష్టమవుతోందని బిల్డర్లు చెబుతున్నారు.
- రెండు మూడు సంస్థలు జాయింట్ వెంచర్(జేవీ)గా ఏర్పడి షెడ్యూలు దాఖలు చేయడానికి వీల్లేదని హ్యాపీనెస్ట్ టెండర్ నోటిఫికేషన్‌లో సీఆర్‌డీఏ నిబంధన విధించింది. కానీ ఆ ప్రాజెక్టు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 25 శాతం పనులను సబ్ కాంట్రాక్టు కింద అప్పగించే వెసులుబాటు కల్పించింది. దీన్ని బట్టి ముందే ఎంపిక చేసిన బడా కాంట్రాక్టు సంస్థకు హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టును అధిక ధరలకు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకునే వ్యూహంతో 'ముఖ్య'నేత చక్రం తిప్పినట్లు వెల్లడవుతోంది.

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణం ముసుగులో అమరావతిని కూటమి ప్రభుత్వం కుంభకోణాల మయంగా మార్చేస్తోంది. అడుగడుగునా కమీషన్ల దందాతో ఖజానాకు చిల్లు పెడుతూ అమరావతిని అక్రమాల పురంగా తీర్చిదిద్దుతోంది. హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచేసిన ప్రభుత్వం ఆ భారాన్ని ఇప్పటికే అడ్వాన్సు చెల్లించి ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారిపై మోపితే వ్యతిరేకత వస్తుందని పసిగట్టి దాన్ని రాష్ట్ర ఖజానా నుంచే సర్దుబాటు చేస్తోంది. అంటే.. ప్రభుత్వ ఖజానా నుంచి కాంట్రాక్టు సంస్థకు దోచిపెట్టి, వాటినే కమీషన్ల రూపంలో వసూలు చేసుకునేందుకు 'ముఖ్య'నేత చక్రం తిప్పినట్లు స్పష్టమవుతోందని బిల్డర్లు చెబుతున్నారు. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారి అవతారం ఎత్తి చేపట్టిన హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టు టెండర్లలో భారీ ఎత్తున జరిగిన అక్రమాలను గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు బహిర్గతం చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు. షీర్ వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ రెండింటి డిజైన్లు, నిర్మాణ రీతి, సౌకర్యాలు ఒకటే అయినా హ్యాపీ నెస్ట్ నిర్మాణ వ్యయం చ.అడుగుకు రూ.2,500కిపైగా అదనంగా ఉండటమే అక్రమాలకు నిదర్శనమని ఉదహరిస్తున్నారు.

షెడ్యూళ్లకు 8వతేదీ తుది గడువు

అమరావతిలో 2018లో నాటి టీడీపీ సర్కార్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీసింది. నేలపాడు వద్ద 14.46 ఎకరాల్లో జీ+18 అంతస్తుల్లో 1,200 ప్లాట్లతో హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్నారైలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజల నుంచి అడ్వాన్సులు సేకరించింది. హ్యాపీ నెస్ట్ పనులను అప్పట్లో రూ.658 కోట్లకు సీఆర్‌డీఏ కాంట్రాక్టు సంస్థకు అప్పగించింది. అయితే అది ముందుకు కదల్లేదు. ఇప్పుడు అదే ప్రాజెక్టును టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టింది. గత టెండర్‌ను రద్దు చేసింది. తాజాగా రూ.818.03 కోట్ల వ్యయంతో 24 నెలల్లో పూర్తి చేయాలని గడువు నిర్దేశించింది. మూడేళ్ల పాటు



నిర్వహించాలనే నిబంధనతో ఎల్ఎస్ (లంప్సమ్ ఓపెన్) విధానంలో టెండర్లు పిలిచింది. టెండర్ల షెడ్యూళ్ల దాఖలుకు ఈనెల 8వ తేదీని తుది గడువుగా పేర్కొంది. అదే రోజు టెక్నికల్ బిడ్ తెరుస్తారు. ఆర్థిక బిడ్‌లను పదో తేదీన తెరిచి తక్కువ ధరకు కోట్ చేసి ఎల్-1గా నిలిచిన సంస్థకు పనులు అప్పగించే దిశగా సీఆర్‌డీఏ అడుగులు వేస్తోంది. జీఎస్టీ, ఎన్‌ఏసీ, సీనరేజీ లాంటి పన్నులు రూ.153.05 కోట్లు రీయింబర్స్‌మెంట్ చేస్తామని పేర్కొంది. షీర్ వాల్ టెక్నాలజీతో అల్యూమినియం ఫ్రేమ్‌వర్క్, పోడియం, ఆర్కిటెక్చరల్ ఫినిషెస్.. బయట, లోపల విద్యుదీకరణ, ఎల్పీజీ లాంటి సౌకర్యాలతో హ్యాపీ నెస్ట్ ఫ్లాట్లను నిర్మించాలని టెండర్లలో పేర్కొంది.

తగ్గిన ధరలు.. అంచనాల్లో వంచన

హ్యాపి నెస్ట్ ప్రాజెక్టుకు 2018లో తెరతీసిన ప్రభుత్వం.. అప్పట్లో పనులను కాంట్రాక్టర్‌కు రూ.658 కోట్లకు అప్పగించింది. కానీ.. ఆ ప్రాజెక్టు అప్పట్లో ముందుకు కదల్లేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. భవన నిర్మాణాల్లో వినియోగించే స్టీల్, సిమెంట్, కంకర తదితరాలతోపాటు విద్యుత్, శానిటరీ ఉపకరణాల దగ్గర నుంచి లిఫ్టుల వరకూ గతంతో పోలిస్తే ధరలలో పెద్దగా వ్యత్యాసం లేదు. నిజానికి 2018తో పోలిస్తే కొన్నిటి ధరలు ఇప్పుడు బాగా తగ్గాయి. ఇక ఇసుక పూర్తి ఉచితమని ప్రభుత్వమే చెబుతోంది. అలాంటప్పుడు హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయం పెరగడానికి ఆస్కారమే ఉండదని ప్రముఖ బిల్డర్లు స్పష్టం చేస్తున్నారు. అలాంటిది హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువను రూ.818.03 కోట్లుగా నిర్ణయించి తాజాగా సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం, రూ.153.05 కోట్లను పన్నుల రూపంలో రీయింబర్స్‌మెంట్ చేస్తామని పేర్కొనడంపై బిల్డర్లు విస్తుపోతున్నారు. వీటిని పరిగణలోకి తీసుకుంటే హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.971.08 కోట్లకు చేరుతోంది. ప్రాజెక్టులో మొత్తం నిర్మిత ప్రాంతం 21,52,349 చదరపు అడుగులు. ఈ లెక్కన చదరపు అడుగు నిర్మాణానికి రూ.4,511.76 చొప్పున వ్యయం చేస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన డిజైన్ కంటే మరిన్ని అధునాతన సదుపాయాలతో నిర్మాణం చేపట్టినా చదరపు అడుగుకు అన్ని పన్నులతో కలిపినా రూ.1,800 నుంచి రూ.2 వేల లోపే నిర్మాణ వ్యయం అవుతుందని బిల్డర్లు తేల్చి చెబుతున్నారు. ప్రాజెక్టు అంచనాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్కొంటున్నారు.

అక్రమాలు ఇలా బహిర్గతం..

హ్యాపీ నెస్ట్ రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణ రీతిలోనే.. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గెజిటెడ్ ఆఫీసర్లకు టైప్-1, టైప్-2 విధానంలో జీ+12 అంతస్తులతో 14 టవర్లలో 1,440 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.492.04 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు మొత్తం నిర్మిత ప్రాంతం 27,24,080 చదరపు అడుగులు. దీన్ని పరిగణలోకి తీసుకుంటే చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.1,806.29 అవుతుంది. ఇక సీనరేజీ, ఎన్‌ఏసీ, జీఎస్టీ పన్నుల రూపంలో రూ.93.2 కోట్లను రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. ఇవన్నీ కలిపినా గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.2,148.45 దాటదు. దీన్ని బట్టి హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగినట్లు సీఆర్‌డీఏ పిలిచిన టెండర్ల సాక్షిగా బట్టబయలైందని బిల్డర్లు చెబుతున్నారు.

పెట్టుబడులు రూ.1.98 లక్షల కోట్లు ఉద్యోగాలు 1.14 లక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశాలు సృష్టించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ-2025ని రాష్ట్ర మంత్రివర్గం శనివారం ఆమోదించింది. పదేళ్లపాటు ఈ పాలసీ అమల్లో ఉంటుంది.

బిడ్డింగ్ ద్వారా డెవలపర్లకు ఆహ్వానం

విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, జియో థర్మల్, మినీ హైడల్, వేస్ట్ టూ ఎనర్జీ కేంద్రాల స్థాపనకు డెవలపర్ల నుంచి బిడ్లను ఆహ్వానించనున్నాయి. వీటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసి, ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నాయి.

చౌకగా లీజుకు సర్కారీ భూములు..

డెవలపర్లకు ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ఇస్తారు. బిడ్డింగ్‌లో గెలిచిన సంస్థకు మార్కెట్ రేటులో 10 శాతం లీజు రేటుగా నిర్ణయించి భూములను కేటాయిస్తారు. అనంతరం ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం లీజు ధరను ప్రభుత్వం పెంచనుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పంద (పీపీఏ) జరిగాక జిల్లా కలెక్టర్లతో లీజు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

కరెంటు ప్రైవేటుకూ అమ్ముకోవచ్చు

డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ అమ్ముకోవచ్చు. సొంత అవసరాలకూ వాడుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష ధరతో ఇలాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం 25 ఏళ్లు లేదా ప్రాజెక్టు జీవిత కాలానికి స్థలాలను కేటాయిస్తుంది.

ముందు వచ్చిన వారికే ప్రాధాన్యత

సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఎంత సామర్థ్యం లభ్యత ఉందో.. ఆ మేరకు మాత్రమే అనుమతిస్తారు. ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత లభించనుంది. సౌర, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లను రెండేళ్లలో, పవన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు

నీటిపారుదల శాఖ భాగస్వామ్యంతో జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహించనుంది. వీటి ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ విధానంలో కేటాయించనున్నారు.

మహిళా సంఘాలతో సౌర విద్యుత్ కేంద్రాల స్థాపన

500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) నుంచి ఆసక్తి వ్యక్తీకరణను డిస్కంలు విడతలవారీగా ఆహ్వానించనున్నాయి. వారి నుంచి నిర్ణీత ధరకు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయి.

పీఎస్పీ ప్రాజెక్టులకు 45 ఏళ్ల లీజుకు స్థలాలు

పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములను 45 ఏళ్ల లీజుకు కేటాయిస్తారు. వీటి స్థాపన కోసం ప్రైవేటు డెవలపర్లను టెండర్ల ద్వారా ఎంపిక చేస్తే, ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు. 6 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలి. 45 ఏళ్ల తర్వాత ప్రాజెక్టును ప్రభుత్వానికి బదిలీ చేయాల్సి ఉంటుంది. పీఎస్పీ విద్యుత్‌లో 80 శాతం తొలి హక్కు రాష్ట్రమే కలిగి ఉంటుంది.

హైబ్రిడ్ పవర్‌కు ప్రాధాన్యత..

ఒకే ప్రాంతంలో సౌర+పవన, పవన+ఫ్లోటింగ్ సోలార్, విండ్+ స్టోరేజీ, హైబ్రిడ్+స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ఈ పాలసీ ద్వారా ప్రోత్సహించనున్నారు.

భారీ ప్రోత్సాహకాలు..

- పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే భూములకు నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు.
- టీజీ-ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులను సత్వరం జారీ చేస్తారు.
- పారిశ్రామిక హోదా కల్పించి రాష్ట్ర పారిశ్రామిక విధానం కింద అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను వర్తింపజేస్తారు.
- ప్రతి మెగావాట్‌కు 4 ఎకరాలు చొప్పున భూగరిష్ట పరిమితి చట్టం నుంచి మినహాయింపు కల్పిస్తారు.
- భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లిస్తారు.
- వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 100 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్ చెల్లింపుల నుంచి మినహాయింపు ఇస్తారు. ఇతర కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లుఅందుతాయి. జెన్‌కో, ట్రాన్స్‌కో సాంకేతిక సహకారం అందిస్తాయి.
- పీసీబీ నుంచి ఎన్‌ఓసీ మినహాయింపు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సౌర, పవన విద్యుత్ వాడుకుంటే 8 ఏళ్ల పాటు విద్యుత్ సుంకం మినహాయింపు కల్పిస్తారు.
- పీఎస్పీ ప్రాజెక్టులకు నీటి సుంకాన్ని తిరిగి చెల్లిస్తారు.

డిస్కంలకు విక్రయిస్తే ప్రత్యేక ప్రోత్సాహకాలు

- సూపర్‌వైజేషన్ చార్జీల మినహాయింపు.
- ఇతర సౌర, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ, ఇతర ప్రాజెక్టులకు 50 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- ఎస్‌హెచ్‌జీలు/గ్రామ సమాఖ్యలు ఏర్పాటు చేసే సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులతో పాటు వ్యక్తిగత గృహాలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ స్కూల్స్, కార్యాలయాలపై ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకు 100 శాతం స్టేట్ జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.

ఆర్డీఎస్ కాల్వలో పూడికతీత

- సొంత ఖర్చులతో పనులు చేపట్టిన రైతులు



నారాయణపురం శివారులో కొనసాగుతున్న ఆర్డీఎస్ కాల్వ పూడికతీత పనులు

మానవపాడు: మండలంలోని నారాయణపురం శివారు గ్రామంలో ఉన్న ఆర్డీఎస్ కాల్వలో ఆదివారం పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కిందిస్థాయి గ్రామాల రైతుల పొలాలకు నీరు అందకపోవడంతో తమ సొంత ఖర్చులతో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆర్డీఎస్ కింది కాల్వలో ఉన్న మానవపాడు, చెన్నిపాడు, పోతులపాడు గ్రామ శివారులో ఉన్న డీ-29, డీ-30, డీ-31 పొలాలకు సైతం నీరు అందడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్డీఎస్ కాల్వలకు నీరు అందేల చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అభివృద్ధికి ప్రజాఉద్యమాలే పరిష్కారం

- కృష్ణానది నీళ్లను డిండి తరలించడం తగదు
- నెరవేరని ప్రజల ఆకాంక్ష
- పాలమూరుకు అన్యాయం జరిగితే ఊరుకోం
- పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొ.హరగోపాల్



మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొ.హరగోపాల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ప్రజా ఉద్యమాలే అంతిమ పరిష్కారమని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొ.హరగోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో ప్రజా సంఘాలు, మేధావులతో పాలమూరు అధ్యయన వేదిక నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానం పేరుతో కృష్ణా, గోదావరి నదుల నీటిని తరలించి కావేరి నదికి తీసుకెళ్తున్నారన్నారు. పాలమూరు-డిండి లిఫ్ట్ పథకాన్ని చేపట్టేందుకు క్యాబినెట్ ఆమోదం తెలుపడం సమంజసం కాదన్నారు. పాలమూరు జిల్లాను ఎండబెట్టి కృష్ణానది నీళ్లను డిండికి తరలించడంపై మండిపడ్డారు. నీటి వాటాలో జరుగుతున్న అన్యాయంపైనే ఇక్కడ ఉద్యమాలు ప్రారంభమై తెలంగాణ ఉద్యమంగా రూపాంతరం చెంది రాష్ట్రాన్ని సాధించినా పదకొండేళ్ల కాలంలో పాలమూరు ప్రజల ఆకాంక్ష నెరవేరలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన వివక్షనే తెలంగాణ రాష్ట్రంలోనూ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను రెండు భాగాలుగా విభజించి శ్రీశైలం నుంచి తీసుకుంటున్న నీటిని కల్వకుర్తి పథకంతో సమన్వయం చేయాలని అన్నారు. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడ కురిసిన నీటిని అక్కడే నిలిపి భూగర్భ జలరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి నీటి పంపిణీ జరుగలేదని, వెంటనే న్యాయమైన వాటా నీరు సాధించాలన్నారు. ఉమ్మడి జిల్లా వెనుకబాటుతనం రూపుమాపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డిండి ఎత్తిపోతలతో పాలమూరుకు జరిగే అన్యాయాన్ని చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి పాలమూరు-డిండి నీటి తరలింపును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, తిమ్మప్ప, సీపీఐ నాయకులు పరమేశ్‌గౌడ్, బాలకిషన్, టీజేఏసీ నాయకులు రాజేందర్‌రెడ్డి, టీఎఫ్‌టీయూ నాయకులు ఎస్‌ఎం ఖలీల్, డీటీఎఫ్ నాయకులు వామన్‌కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న పాలమూరు అధ్యయన వేదిక నాయకులు

ఉమ్మడి జిల్లా కవులకు పురస్కారాలు



కవి బోల యాదయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఆదివారం వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారిని పండుగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు బోల యాదయ్య (సాహిత్యం, కవిత్వం), కేపీ లక్ష్మీనర్సింహ (కథా సాహిత్యం), వనపట్ల సుబ్బయ్య (కవిత్వం), ఎస్.యాదయ్య (ఇంద్రజాలం)లు పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్, చంద్రశేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన వాలీబాల్ జట్టు



వాలీబాల్ జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 19 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తెలంగాణ బాలికల జట్టు ఆదివారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రాష్ట్ర జట్టును పలువురు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బాలరాజు, సాయినాథ్, రాఘవేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వస్తున్న భక్తులు



అలంపూర్‌లోని జోగులాంబ అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి

- ఆలయంలో ప్రత్యేకపూజలు
- ముందస్తు ఏర్పాట్లు చేసిన అధికారులు

అలంపూర్ : ఐదవ శక్తిపీఠమైన జోగుళాంబ అమ్మవారి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో స్థానిక, స్థానికేతర భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. ఆలయాలకు ప్రముఖులు సైతం తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తులు క్యూలైన్ల ద్వారా వచ్చి అమ్మ, స్వామివార్లను దర్శించుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు ఆలయ సముదాయంలోని నిత్యాన్నదాన సత్రంలో భోజన వసతి కల్పించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

మంచు కురిసే వేళలో..

- ఎనిమిది దాటినా జాడ లేని సూర్యుడు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రోజురోజుకు చలి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు తగ్గిపోయి మంచు దుప్పటిని కమ్మేస్తున్నాయి. ఉదయం ఎనిమిది దాటుతున్నా భానుడి(సూర్యుడి) జాడ లేకుండాపోతోంది. బల్మూర్-అచ్చంపేట వెళ్లే వాహనదారులు ఆదివారం ఉదయం రోడ్లపై లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వాకర్లు, పాడి రైతులు, కల్లు గీతకార్మికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంచు కమ్మేస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు, మనుషులు సరిగా కనబడటం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నిదానంగా వెళ్తున్నారు.

– బల్మూర్



ఎనిమిది దాటిన బల్మూర్-అచ్చంపేట రహదారిపై తగ్గని పొగమంచు



7:30 గంటలకు కమ్మేసిన మంచులో వాకర్లు